

నవంబర్ 7న జాబ్ మేళా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గంలోని మోడల్ కెరీర్ సెంటర్ ప్రాంగణంలో నవంబర్ 7న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.హరీష్‌చంద్రప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో బ్యాంక్ ఆఫ్ బరోడా, ఆంధ్రా మీడియా, ఎస్‌బిఐ పేమెంట్స్, క్రెడిట్ కార్డ్స్ మరియు భరత్ పే సంస్థలలోని పలు ఖాళీలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. 10వ తరగతి నుండి డిగ్రీ పూర్తిచేసి, అనుభవం ఉన్న లేదా ఆసక్తి గల 19 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని వివరించారు. ఎంపికైన వారికి తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా tinyurl.com/jf1may25 లింక్ ద్వారా తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

కోళ్ల వ్యర్థాల్లోనూ వాటాలా..!

- అమ్మకాలపై ప్రజాప్రతినిధి పెత్తనం
- ఓ ప్రయివేటు ఏజెన్సీకే అమ్మాలంటూ హుకుం
- ఈ మేరకు సర్క్యులర్ జారీ చేసిన అధికారి



ప్రజాశక్తి - రాజానగరం

ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన స్థానంలో ఉన్న ప్రజా ప్రతినిధి... వాటిని విస్మరించి అన్నింటా వాటాల కోసం పాకులాడుతున్నారు. చివరకు కోళ్ల వ్యర్థాల అమ్మకాల్లోనూ తలదూర్చారు. అధికారులపై ఒత్తిళ్లు తెచ్చి హడావుడిగా తను సూచించిన ఏజెన్సీకే వ్యర్థాలను అమ్మేలా సర్క్యులర్‌ను సైతం జారీ చేయించారు.. ప్రస్తుతం రాజానగరం నియోజకవర్గంలో ఏ ఇద్దరున్నా వారి మధ్య కోళ్ల వ్యర్థాలపై చర్చ నడుస్తోంది.

రాజానగరం నియోజకవర్గంలో సుమారు 250 నుంచి 300 వరకూ మాంసం దుకాణాలు ఉన్నాయి. పలు కుటుంబాలు, కొంత మంది నిరుద్యోగులు ఇదే వృత్తిగా చేసుకుని ఉపాధి పొందుతున్నారు. మాంసం అనంతరం కోళ్ల వ్యర్థాలను కూడా వీరు అమ్ముకుని ఎంతోకొంత సొమ్ము చేసుకుంటున్నారు. కోళ్ల వ్యర్థాల అమ్మకాల ద్వారా ఆయా దుకాణం పరిమితిని బట్టి రోజూ రూ.300 నుంచి రూ.500 వరకూ అదనపు ఆదాయం పొందుతున్నారు. ఇంత వరకూ బాగానే ఉంది. ప్రస్తుతం ఈ పరిస్థితి లేదు. కోళ్ల వ్యర్థాల అమ్మకాల్లోనూ వాటా కోసం నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధి కన్నేశారు. ఆయన అనుకున్నదే తడవుగా ఆలోచనను అమల్లో పెట్టారు. కోళ్ల వ్యర్థాల అమ్మకాల కోసం అధికారులపై ఒత్తిడి తెచ్చారు. గతంలో ఎన్నడూ కోడి మాంసం దుకాణాల వద్ద లభించే వ్యర్థాల అమ్మకాలకు ఆదేశాలు ఇచ్చిన దాఖలాలు లేవు. తొలిసారిగా రాజానగరం ఎంపిడిఒ పేరుతో వచ్చిన సర్క్యులర్ వివాదాస్పదమైంది. దీనిపై దుకాణదారులు పిజిఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేయడంతో విషయం బయటకు వచ్చింది.


అసలు ఏంటీ సర్క్యులర్

మండలంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు గోదావరి ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీకి మాత్రమే కోళ్ల వ్యర్థాలను విక్రయించాలి అంటూ ఈ ఏడాది జూన్ 2న ఎంపిడిఒ ఝూన్సీ సర్క్యులర్‌ను జారీ చేశారు. ఆ ఏజెన్సీ ఒక్కో దుకాణానికి రూ.200 చెల్లించేలా సర్క్యులర్‌లో పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం లైసెన్స్ ఉన్న వ్యక్తికి మాత్రమే వ్యర్థాలను విక్రయించాలి. సర్క్యులర్‌లో పేర్కొన్న గోదావరి ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీకి లైసెన్స్ ఉందా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా ఉంది. మాంసం దుకాణదారులు వ్యతిరేకిస్తూ ఈ నెల 4న పిజిఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు.

దీనిపై ఎంపిడిఒ జె.ఝూన్సీని వివరణ కోరగా ఇప్పటికే నియోజకవర్గంలో సీతానగరం, కోరుకొండ మండలాల్లో వ్యాపారులు గోదావరి ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీకి కోళ్ల వ్యర్థాలను విక్రయిస్తున్నారని, అందుకే రాజానగరం మండలంలో కూడా అదే ఏజెన్సీకి ఇచ్చేలా సర్క్యులర్‌ను జారీ చేసినట్లు తెలిపారు. రాజానగరం గ్రామ కార్యదర్శి ప్రసాదును వివరణ కోరగా కోడి మాంసం దుకాణాలు వ్యర్థాల అమ్మకాలపై పిజిఆర్‌ఎస్‌లో అర్జీ వచ్చిందన్నారు.

దుకాణదారుల ఆగ్రహం

ఈ సర్క్యులర్‌పై మాంసం దుకాణదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ దుకాణాల్లో వ్యర్థాలను తాము ఇష్టం వచ్చిన వ్యాపారికి అమ్ముకునే వీలుండేదన్నారు. ఈ సర్క్యులర్ వల్ల తక్కువ ధరకే వ్యర్థాలను అమ్ముకోవాల్సి వస్తుందన్నారు. దీని వల్ల తాము నష్టపోతున్నామని తెలిపారు. ఎన్నడూ లేనిది ఇక్కడ సర్క్యులర్ విడుదల చేయడం విడ్డూరంగా ఉందన్నారు. దీనిపై పిజిఆర్‌ఎస్‌లో ఇప్పటికే ఫిర్యాదు చేశామని తెలిపారు. వెంటనే ఈ సర్క్యులర్‌ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.



మండల పరిషత్ అభివృద్ధి అధికారి,
మండల ప్రజా పరిషత్, రాజానగరం.

నకు అందరు పంచాయతీ కార్యదర్శులకు.
నకలు ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల ప్రజా పరిషత్, రాజానగరం వారికి.

ఎంపిడిఒ అధికారికంగా ఇచ్చిన సర్క్యులర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి

బోధన నాణ్యతపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్యా బోధన నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పాఠశాల విద్య, ఇంటర్, ఒకేషనల్, ఎస్ఎస్ఎ విద్యా బోధన, మౌలిక సదుపాయాలు, పెండింగ్ పనులు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల్లో సృజనాత్మక శక్తి పెంచేలా చదవడం, రాయడం సరిగా రాని విద్యార్థులకు 'విద్యా శక్తి' కార్యక్రమం కింద సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి బోధన చేయాలని ఆదేశించారు. అందుకు అనుసరించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులు డ్రాప్ అవుట్ కాకుండా చర్యలు తీసుకోవాలని, వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్స్ ద్వారా పాఠశాలకు రాని మైగ్రెంట్ పిల్లలను గుర్తించి సమీప పాఠశాలలో చేర్పించాలని ఆదేశించారు. జిల్లాలో 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులలో ఇంకా సుమారు 6,000 మంది విద్యార్థులకు అపార్ ఐడీ లేదని, తప్పనిసరిగా వారందరికీ ఐడీలు తక్షణం సృష్టించాలని ఆదేశించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ద్వారా విద్యార్థులు ప్రయోగాత్మకంగా నేర్చుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. తల్లికి వందనం పథకం కింద సాంకేతిక కారణాల వలన నిధులు జమ కాకపోయిన లబ్ధిదారుల జాబితాను గ్రామ/వార్డు సచివాలయాలతో సమన్వయం చేసి సిద్ధం చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందించే భోజనం రుచిగా, శుచిగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై ఇంకా ఇంటర్‌లో చేరని విద్యార్థుల గుర్తించి, అందుకు కారణాలను వివరంగా సేకరించి నివేదికను అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి నుంచి ఐఐటీ శిక్షణ అందించే అంశాన్ని పరిశీలించాలన్నారు. అవసరమైన పాఠశాల భవనాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, మౌలిక సదుపాయాలు, మరమ్మతులు, స్కూల్ గ్రాంట్స్ వినియోగం సక్రమంగా ఉండాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుకునే ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి, వారికి తగిన ప్రోత్సాహకాలు అందించాలని సూచించారు. నీట్, జెఇఇ మెయిన్స్ తదితర పరీక్షల కోసం సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులలో మానసిక వత్తిడి, అనవసర ఆందోళన, తగ్గించేందుకు కౌన్సిలర్స్ (15 మంది)ని నియమించినట్లు అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వారితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు సాధించే క్రమంలో వొకేషనల్ టీచర్స్ (69 మంది) నియామకాలు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. పిఎం శ్రీ స్కూల్ రైజ్ ఆఫ్ ఇండియా పథకంలో 26 పాఠశాలలకు అనుమతులు లభించాయని, మౌలిక వసతుల పనులు 90 శాతంపూర్తయ్యాయని, మిగతా పనులు త్వరగా ముగించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ఏడాది మరో 6 పాఠశాలల కోసం రూ.3.45 కోట్ల గ్రాంట్ విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న వాటిని సమీప ప్రభుత్వ పాఠశాలలతో విలీనం చేసే విధానంలో మార్గదర్శకాలు అనుసరించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఐసిడిఎస్ పీడీని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఇఒ కె. వాసుదేవరావు, ఎస్-ఎస్ఎ పీడీ ఎస్.సుభాషిణి, ఐసిడిఎస్ పీడీ టి.శ్రీదేవి, జిల్లా ఇంటర్మీడియట్/వొకేషనల్ అధికారి ఎన్ఎస్‌విఎల్.నరసింహం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

9 వరకూ వన్ హెల్త్ వారోత్సవాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

'వరల్డ్ వన్ హెల్త్ డే" పురస్కరించుకొని ఈ నెల 9వ తేదీ వరకూ 'వన్ హెల్త్' వారోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 'ఆరోగ్యం మహాభాగ్యం. ఒకరి ఆరోగ్యాన్ని కాపాడితే, సమాజంలోని ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని కాపాడినట్టే అవుతుంది' అని అన్నారు. ప్రకృతిని సంరక్షించడం ద్వారా మానవజీవితం సురక్షితమవుతుందని, చెట్లు నాటడం జీవరక్షణకు దారి తీస్తుందన్నారు. స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహారం ప్రకృతిని కాపాడినప్పుడే సాధ్యమవుతుందన్నారు. వ్యాయామం, యోగా మన ఆరోగ్యానికి మూలాధారమని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడు తన వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ ఇన్‌చార్జ్ అధికారి డాక్టర్ షమ్మీకుమార్, డిపిఎంయు డాక్టర్ శ్రీవల్లి, సూపరింటెండెంట్ స్టాలిన్, సిసి రాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ వెంకటేశ్వరరావు

యాత్రికుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని నదీ స్నానాలు ఆచరించేందుకు వచ్చే యాత్రికుల రద్దీకి అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు నగర పాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. బుధవారం ఉదయం పుష్కర ఘాట్లో ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. యాత్రికులతో మాట్లాడి తాగునీరు, మరుగుదొడ్లు, ప్రథమ చికిత్స శిబిరం, లాకర్ సదుపాయాలపై ఆరా తీశారు. ఘాట్ పరిసరాలతో పాటు దుస్తులు మార్చుకొను గదుల వద్ద ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉంటూ భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. అత్యవసర సమయంలో సహాయం అందించేందుకుగాను నది వెంబడి బోట్లు, గత ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రమాదాలు జరగకుండా పడవల సంఖ్యను పెంచాలని ఇంజనీరింగ్ విభాగానికి సూచించారు. రాత్రి పూట ఘాట్‌లో విద్యుత్ దీపాలు, యాత్రికులకు వివిధ సమాచారం అందించేందుకు సమాచార కేంద్రం, సిసి కెమెరాల పర్యవేక్షణ ఉండాలన్నారు. అనంతరం గోరక్షణపేటలోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పుష్కర ఘాట్‌లో పరిస్థితిని సమీక్షిస్తున్న కమిషనర్ రాహుల్‌మీనా

అండర్-19 క్రికెట్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - చాగల్లు

ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 19 క్రికెట్ పోటీలకు చాగల్లు జడ్‌పిహెచ్ఎస్ విద్యార్థులు ఎస్.గీత, ఎం.తేజశ్రీ ఎంపికయ్యారని పీడీ జె.విజయలక్ష్మి తెలిపారు. అక్టోబర్ నెలలో ఏలూరులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభను చాటుకున్న వీరిని రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక చేశారని ఆమె వెల్లడించారు. విద్యార్థులను ఈ సందర్భంగా హెచ్ఎం వి.వాసవి, టీం మేనేజర్ టి.మునేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో పీడీ విజయలక్ష్మి

పిఎంపి మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - పెరవలి

పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. బుధవారం స్థానిక ఎస్‌సి కమ్యూనిటీ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాక్షన్ కమిటీ చైర్మన్ కోటేశ్వరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి వీరేశలింగం, జిల్లా అధ్యక్షులు ఎఎస్‌వి.కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులుగా నక్కా శేఖర్, కార్యదర్శిగా షేక్ సయ్యద్ బాబ్జి, కోశాధికారిగా నాగబాబు, ఉపాధ్యక్షులుగా సతీష్, సహాయ కార్యదర్శిగా సతీష్, మరో ఏడుగురు సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం శాంతిశ్రీ హాస్పటల్ ఆధ్వర్యంలో విజ్ఞాన తరగతులు నిర్వహించారు. నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.



ఎంపికైన నూతన కార్యవర్గం

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని పలువురు బాధితులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి బాధితులకు అందజేశారు. బుధవారం ఎంఎల్ఎ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో 15 మంది బాధితులకు రూ.11.89 లక్షల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రయివేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్న వారికి మానవతా దృక్పథంతో సిఎం చంద్రబాబు అండగా నిలుస్తున్నారని అన్నారు. సిఎం సహాయ నిధి ద్వారా బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం భరోసాగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



బాధితులకు చెక్కును అందిస్తున్న గోరంట్ల

ఉపాధి పనుల గుర్తింపుపై గ్రామ సభ

ప్రజాశక్తి - సీతానగరం

ఉపాధి హామీ చట్టంలో చేపట్టే పనుల గుర్తింపు కోసం బుధవారం మండలంలోని రాపాకలో గ్రామ సభ జరిగింది. ఇంజనీరింగ్ కన్సల్టెంట్ టి.నాగేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన సభలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. గ్రామస్తుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, గ్రామంలో మౌలిక వసతులు, నీటి సంరక్షణ, స్థిరమైన ఆస్తుల కల్పన లక్ష్యంగా పనులను గుర్తించారు. పంట కాలువలు 25, కంపోస్ట్ పిట్లు 8 (పశువుల ఎరువును నిల్వ చేయడానికి), గోకులాలు 4, ఇంకుడు గుంతలు 8 గుర్తించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో పారదర్శకతను మరింత పెంచడం, బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట వేయడం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ-కెవైసివెరిఫికేషన్ ప్రాధాన్యతను సభలో వివరించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి శ్రామికుడు తమ వివరాలను ఆధార్‌తో అనుసంధానించి, ఈ-కెవైసి వెరిఫికేషన్‌ను కచ్చితంగా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భావిశెట్టి సాయిరాహుల్, ఎంపిటిసి సత్యనారాయణ, సెక్రటరీ అరుణ్‌కుమార్, కూటమి పార్టీల నాయకులు, టెక్నికల్ అసిస్టెంట్ సింహాద్రి, ఫీల్డ్ అసిస్టెంట్ చరణ్ పాల్గొన్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - గోపాలపురం

మండల వ్యవసాయ ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. బుధవారం స్థానికంగా జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులుగా దున్న సీతారాములు, కార్యదర్శిగా గోసానబోయిన రామారావు, కోశాధికారిగా దేవరపల్లి విజయకుమార్‌తోపాటు, మరో 13 మంది ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కొర్లపాటి రాము, హస్పటల్ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ జేష్ఠ శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. నూతన అధ్యక్షుడు దున్న సీతారాములు మాట్లాడుతూ సంఘ అభివృద్ధితోపాటు, రైతుల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.




నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న నాయకులు

ముసుళ్లగుంటలో 'పొలం పిలుస్తుంది'

ప్రజాశక్తి - నల్లజర్ల

మండలంలోని ముసళ్లగుంటలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. సర్పంచ్ నందమూరి శారదాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎఒ సోమశేఖర్ సమగ్ర పంటల యాజమాన్యం విధానాలన్ వివరించారు. ఈ కార్యక్రమంలో నందమూరి రామకృష్ణ, వెల్లి సుబ్బారావు, పాలకలపాటి హరికృష్ణ, వెంకటేశ్వరరావు, వెల్లి నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎఒ

ఘనంగా బిర్సాముండ జయంతి

ప్రజాశక్తి - చాగల్లు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బిర్సా ముండా 150వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో డిఎస్‌టిడబ్ల్యూఒ కె.జ్యోతి, ఎఎంసి చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ టి.తనూజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన సామాజికవర్గ ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ఎంపిడిఒ శ్రీదేవి అవగాహన కల్పించారు.

కార్టూ'నిజం'



ఉత్సాహంగా చెకుముకి పోటీలు

జిల్లాలోని పలు మండలాల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాల పోటీలు బుధవారం జరిగాయి. ఈ పోటీల్లో వివిధ ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

చాగల్లు స్థానిక జడ్‌పిహెచ్ఎస్‌లో బుధవారం జెవివి ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో మండలంలోని చిక్కాల, కలవలపల్లి, చాగల్లు జడ్‌పిహెచ్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో చిక్కాల జడ్‌పిహెచ్ఎస్ విద్యార్థులు జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు ఎంపికయ్యారని యుటిఎఫ్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు ఎస్.వాసవి, జె.శ్రీనివాస్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు. **దేవరపల్లి** స్థానిక ఎఎస్ఎన్ జడ్‌పిహెచ్ఎస్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నుంచి 21 మంది 7 గ్రూపులుగా పాల్గొన్నారని జెవివి మండల కన్వీనర్ కె.శ్యాంసుందర్ తెలిపారు. ఈ పోటీల్లో భాష్యం స్కూల్ విద్యార్థులు పి.శరణ్య, పి.మహాలక్ష్మి, జి.మనస్వి ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విజేతలను భాష్యం స్కూల్ జోనల్ ఇన్‌ఛార్జ్ వి.ఆంజ నేయులు, ప్రిన్సిపల్ పి.పేరయ్యనాయుడు, చాంప్స్ ప్రిన్సిపల్ షేక్ షభానా, ఉపాధ్యాయులు అభినందిం చారు. **గోపాలపురం** స్థానిక జడ్‌పిహెచ్ఎస్‌లో జెవివి ఆధ్వర్యంలో చెకుముకి పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో మండలంలోని 5 ప్రభుత్వ పాఠశాలల నుంచి 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో రాజంపాలెం హైస్కూల్ విద్యార్థులు బండారు దేవి, కె.రమ్యశ్రీ, ముళ్లపూడి ప్రణీత్ ఉత్తమ ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని హైస్కూల్ హెచ్ఎం మడిచర్ల శ్రీనివాస్ అభినందించారు.



చాగల్లులో ప్రశంసాపత్రాలతో విద్యార్థులు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్ బుజ్జియ్యచౌదరి

పాఠశాలలో భోజనశాల ప్రారంభం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని వెదుళ్లపల్లి గ్రామంలోనిబొల్లి మునియ్య మెమోరియల్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో నూతనంగా నిర్మించిన భోజనశాలను బుధవారం ప్రారంభం అయింది. ప్రొలిఫిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత సత్య బొల్లి దాతృత్వంతో సుమారు రూ.6 లక్షల వ్యయంతో ఈ భోజనశాలను నిర్మించారు. గ్రామ సర్పంచ్ పెందుర్తి బుజ్జియ్యచౌదరి, ఎస్ఎంసి చైర్మన్ పడాల వరలక్ష్మి భోజనశాలను ప్రారంభించారు. గతంలో పాఠశాలను దత్తత తీసుకున్న సత్య బొల్లి, ఈ భోజనశాలతో పాటు సైన్స్ ల్యాబ్, స్టాఫ్ రూమ్ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. దాత సత్య బొల్లి, కూటమి పార్టీల నాయకుడు నీరుకొండ వీరన్నచౌదరికి విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎన్‌వివి. సత్యనారాయణ, కూటమి నాయకులు తన్నీరు సురేష్, విశ్వనాథం, నీరుకొండ శ్రీను, గెద్దాడ త్రిమూర్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరంలోని శ్రీరామ హోటల్ వద్ద బస్సు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... బుధవారం పెరవలి మండలం కానూరుకు చెందిన ఆరుట్ల సూర్యనారాయణ(58) బైకుపై వెళ్తున్నాడు. ఆయన ఉండ్రాజవరం శ్రీరామ హోటల చెంతకు చేరే సరికి తణుకు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ఆర్‌టిసి బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ డి.రవికుమార్ మాట్లాడారు. హెల్మెట్ లేకపోవడం వల్లే సూర్యనారాయణ మృతి చెందారన్నారు. హెల్మెట్ ధరించి ఉంటే స్వల్పగాయాలతో బయటపడేవాడన్నారు. వాహనదారులు తప్పకుండా హెల్మెట్‌ను ధరించాలని ఆయన కోరారు.

చోరీ కేసులో రిమాండ్

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలు గ్రామంలో మిల్క్ పార్లర్ ఏజెన్సీ షాపులో రూ.45వేలను అపహరించిన కేసులో నలుగురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. వీరిలో ముగ్గురు మైనర్లు ఉన్నారని ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు చేబ్రోలులో చల్లా చినబాబు మిల్క్ పార్లర్స్ ఏజెన్సీని నిర్వహిస్తున్నాడు. నవంబర్ 1న ఇద్దరు మైనర్లు ఆయన షాపు వద్దకు వచ్చారు. ఒక మైనర్ అతన్ని మాటల్లో పెట్టగా మరొక బాలుడు కౌంటర్‌లో ఉన్న రూ.45వేలను తస్కరించాడు. అనంతరం అక్కడే మరో ఇద్దరు రెండు బైకులపై సిద్ధంగా ఉన్నారు. ఈ డబ్బును తీసుకుని నలుగురూ అక్కడి నుంచి పరారయ్యారు. దీనిపై షాపు యజమాని చినబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గుబ్బల దయానందరావు, మరో ముగ్గురు మైనర్లను నిందితులుగా గుర్తించారు. బుధవారం వారిని జాతీయరహదారిలోని చెందుర్తి జంక్షన్ వద్ద అరెస్టు చేశారు. వారిని కోర్టు ముందు హాజరుపరిచారు. దయానందరావుకు రిమాండ్ విధించారు. మైనర్లను జువైనల్ హోమ్‌కు తరలించారని ఎస్‌ఐ తెలిపారు.



వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌పి వరదరాజన్

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

ప్రజాశక్తి - యానాం

భార్య హత్య కేసులో భర్తను యానాం పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్‌పి వరదరాజన్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. గుత్తెనదీవికి చెందిన పెమ్మాడి నాని, యానాంకు చెందిన దీనను ఏడేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఆరేళ్ల కుమార్తె ఉంది. వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో యానాంకు కాపురానికి వచ్చారు. ఇక్కడికి వచ్చిన తరువాత నాని మద్యానికి బానిసై భార్యను మరింత వేధింపులకు గురిచేశాడు. భర్త వేధింపులు తాళలేక దీనా నాలుగు నెలల క్రితం బల్లావారి వీధిలోని ఒక ఇంట్లో అద్దెకు ఉంటుంది. విడాకుల కోసం యానాం కోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 3న నాని దీనా ఇంటికి వచ్చి గొడవపడ్డాడు. ఆమెను తీవ్రంగా కొట్టి గొంతు నులిమి హత్య చేశాడు. ఆమె మృతదేహాన్ని కుమార్తె వద్ద ఉంచి పరారయ్యాడు. తల్లి లేవకపోవడంతో బాలిక స్థానికులకు తెలిపింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. నిందితుని బుధవరం గుత్తెనదీవిలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచామని ఎస్‌పి తెలిపారు. ఎస్‌పి వెంట ఎస్‌ఐలు పుణీత్‌రాజ్, కట్టా సుబ్బరాజు, క్రైం టీమ్ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి - కొవ్వూరు

మండలంలోని కాపవరం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని రెల్లిపేటకు చెందిన ఆరుగురు యువకులు మోటారు సైకిళ్లపై ఐ.పంగిడి వెళ్లి తిరిగి వస్తుండగా కాపవరం సమీపంలో ప్రాథమిక పరిశీలనలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొట్టుకున్నట్లు గుర్తించామన్నార. ఈ ప్రమాదంలో అల్లం గణేష్(21) మృతి చెందగా, మీసాల పరుశురాం, లోకేష్ తీవ్రంగా గాయపడ్డారని ఎస్‌ఐ కె.శ్రీణివాసరావు తెలిపారు. మరో ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. మృతుడు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. క్షతగాత్రులను రాజమహేంద్రవరంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.

జాబ్ కార్డుదారులకు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

జాబ్ కార్డు ఉన్న ఉపాధి హామీ కూలీలు ప్రతీ ఒక్కరు ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని సర్పంచ్ దాయం కావేరి, ఎన్‌ఆర్‌ఇజిఎస్ జెఇ రవికుమార్ అన్నారు. బుధవారం కాలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంవద్ద బుధవారం గ్రామ సర్పంచ్ దాయం కావేరి అధ్యక్షతన జరిగిన ఉపాధి హామీ గ్రామ సభల్లో 2026 -2027 ఆర్థిక సంవత్సరం సంబంధించి గ్రామంలో గుర్తిం చిన ఉపాధి హామీ పనుల నివేదికను ఫీల్డ్ అసిస్టెంట్ కె.క్రాంతి కుమార్ గ్రామ సభలో చదివి వినిపించారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్ జెఇ రవికుమార్ మాట్లాడు తూ ఉపాధి హామీ చట్టంలో జాబ్ కార్డు కలిగిన ఉపాధి కూలీలు ప్రతి ఒక్కరూ ఫీల్డ్ అసిస్టెంట్ లాగిన్‌లో తప్పనిసరిగా ఇకెవైసి చేయించు కోవాలని అన్నారు. కాలేరు గ్రామంలో 55 పనులను గుర్తించినట్లు తెలి పారు. ఈ పనుల వివరాల నివేదికను ఉన్నతా ధికారులకు తెలియజే యునట్లు జెఇ రవి కుమార్ తెలిపారు. గ్రామ సభలో గ్రామ సర్పంచ్ దాయం కావేరి, గ్రామ కార్యదర్శి యు.సుప్రియ, దాయం శేఖర్ బాబు, పెయ్యల యాకోబు, ఫీల్డ్ అసిస్టెంట్ కె. క్రాంతి కుమార్, మేట్లు, ఉపాధి కూలీలు, రైతులు పాల్గొన్నారు.

సిబ్బంది లేక ఖాళీగా దర్శనమిస్తున్న సచివాలయాలు

ప్రజాశక్తి - గోపాలపురం


దొండపూడి సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు ఖాళీగా కుర్చీలు

సిబ్బంది లేకపోవడంతో మండలంలోని పలు సచివాలయాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. పనుల కోసం సచివాలయాలకు వెళ్లిన ప్రజలు నిరాశతో వెనుదిరాగాల్సి వస్తుంది. బుధవారం దొండపూడి సచివాలయానికి వివిధ పనుల నిమిత్తం పలువురు గ్రామస్తులు వచ్చారు. సిబ్బంది లేకపోవడంతో వారు నిరాశకు గురయ్యారు. వారు మాట్లాడుతూ సచివాలయంలో ఇద్దరు ఇన్‌ఛార్జులు మాత్రమే ఉన్నారని తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్, ఎఎన్ఎం, అగ్రికల్చర్, డిజిటల్ అసిస్టెంట్ మాత్రమే విధుల్లో ఉన్నారన్నారు. అందులో ఇద్దరు ఫీల్డ్ వర్క్ అంటూ బయటకు వెళ్లిపోయారని తెలిపారు. మరొకరు మధ్యాహ్నం దొండపూడి సచివాలయానికి వివిధ పనుల నిమిత్తం పలువురు గ్రామస్తులు వచ్చారు. సిబ్బంది లేకపోవడంతో వారు నిరాశకు గురయ్యారు. వారు మాట్లాడుతూ సచివాలయంలో ఇద్దరు ఇన్‌ఛార్జులు మాత్రమే ఉన్నారని తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్, ఎఎన్ఎం, అగ్రికల్చర్, డిజిటల్ అసిస్టెంట్ మాత్రమే విధుల్లో ఉన్నారన్నారు. అందులో ఇద్దరు ఫీల్డ్ వర్క్ అంటూ బయటకు వెళ్లిపోయారని తెలిపారు. మరొకరు మధ్యాహ్నం భోజనానికి వెళ్లి తిరిగి రాలేదన్నారు. వారికి ఫోన్ చేసి అడిగితే సర్వే చేస్తున్నామంటూ, మండల కార్యాలయాలయు వెళ్లామంటూ చెబుతున్నారని గ్రామస్తులు తెలిపారు. ఎప్పుడు వచ్చినా ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయని తెలిపారు. గతంలో పనుల కోసం మండల కార్యాలయాలకు వెళ్లకుండా సచివాలయాలకు వెళ్తే సరిపోయేదని, ఇప్పుడు సిబ్బందిని బయట పనులకు పంపించేయడంతో తమ పనులు జరగ్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిబ్బందిని సచివాలయాల్లో అందుబాటులో ఉంచాలని కోరతున్నారు.

యానాం వార్తలు


ఎంపికైన అభ్యర్థులను అభినందిస్తున్న కోచింగ్ సెంటర్ డైరెక్టర్ సత్యనారాయణ

ఉద్యోగాలకు ఎంపికైన వారికి అభినందన

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వం రెవెన్యూ శాఖ ద్వారా వి.ఎ, వి.ఎఒలకు సంబంధించి ఇటీవల నిర్వహించిన రాత పరీక్షల్లో విజయం సాధించిన అభ్యర్థులను శ్రీనివాస్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ ఎంఆర్.సత్యనారాయణ బుధవారం ఘనంగా సత్కరించారు. శ్రీనివాస్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన పోలిశెట్టి శివసాయం యశ్వంత్ వి.ఎఒ రాత పరీక్షలు 200 మార్కులకు గాను 119.50 మార్కులు సాధించి పుదుచ్చేరి రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. చక్రవర్తుల దేవిహరిత 100 మార్కులకు 50 మార్కులు సాధించినట్లు తెలపారు.

అభివృద్ధి పనులకు రూ.10 కోట్ల మంజూరు

ప్రజాశక్తి - యానాం

యానాం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కనకాలపేట పంప్ హౌస్ నుంచి జెండా స్తంభం వరకూ ప్రజా పనుల శాఖ ద్వారా చేపట్టే అభివృద్ధి పనులకు రూ.10 కోట్లు మంజూరైనట్లు ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. ఆయా అభివృద్ధి పనులకు అనుమతులు వచ్చాయని తెలిపారు.



ధర్నా చేస్తున్న పిడబ్ల్యూడి శాఖ ఉద్యోగులు

ఎఫ్‌టిసిఎల్‌ఆర్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి - యానాం

20 ఏళ్లుగా పిడబ్ల్యుడి శాఖలో పని చేస్తున్న 126 మందిని పర్మినెంట్ చేయాలని బుధవారం నిరసన తెలిపారు. ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎంతమంది అధికారులు మారినా తమ కోసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఇంకో నాలుగైదు ఏళ్లలో రిటైర్ అవుతామని, ఉద్యోగాలు చేస్తూ చనిపోయిన వారి కుటుంబాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షునిగా కృష్ణ

ప్రజాశక్తి - పిఠాపురం


కృష్ణను అభినందిస్తున్న వైశ్య ఫెడరేషన్ నాయకులు

మండలంలోని చిత్రాడకు చెందిన కేతవరపు సత్యయేసు కృష్ణ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షునిగా నియమితులయ్యారు. గతంలో వాసవి క్లబ్, ఆర్యవైశ్య సంఘాల్లో కీలక పదవులు చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడతానని అందరినీ కలుపుకుని ముందుకు వెళతానని తెలిపారు. కృష్ణను వైశ్య ఫెడరేషన్ సభ్యులు, బంధు మిత్రులు, పలువురు అభినందించారు.

ఉపాధి పనుల సంఖ్య పెంచాలి

ప్రజాశక్తి - గండేపల్లి



మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా పనులను గుర్తించి కూలీల సంఖ్య పెంచాలని ఎంపిడిఒ సత్యారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సమీక్షా సమావేశం ఎంపిడిఒ శ్రీసత్య రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనిలో భాగంగా అన్ని గ్రామాల్లో పనులు కల్పించి కూలీల సంఖ్య పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. హార్టికల్చర్ ఎస్టిమేషన్ వేసి రైతులు పొలంలో మొక్కలు నాటలన్నారు. ఉపాధి కూలీ లకు ఇకెవైసి నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమా వేశంలో ఎపిఒ కృష్ణంరాజు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా చర్యలపై అవగాహన

ప్రజాశక్తి - మామిడికుదురు

మామిడికుదురు దీప్తి డిగ్రీ మరియు జూనియర్ కళాశాల జాతీయ సేవ పథకం విద్యార్థులు ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా 6వ రోజు కొమరాడ మరియు మాకనపాలెం గ్రామాలలో రోడ్ సేఫ్టీ పై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోడ్డు ప్రమాదాల నుంచి రక్షణ పొందుటకు హెల్మెట్ యొక్క అవసరాన్ని గ్రామస్తులకు అవగాహన కల్పిం చారు. రెండు గ్రామాల్లోనూ విద్యార్థులు హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎ.ఈశ్వరరావు, పి.సుబ్బారావు, వి.నాగరాజు, వి.కొండలరావు, పంచాయతీ కార్యదర్శులు యస్.నాగమణి, డి.సురేష్ మరియు ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి కోటుం కుమార్ చందు శ్రీధర్ ఇటీవల రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలలో కాంస్య పతకం సాధించాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో ఇటీవల నిర్వహించిన అండర్-14 బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి పోటీల్లో మేడిచర్ల రిత్విక విజయం సాధించిన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యింది. త్వరలో విజయ వాడ గన్నవరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననుంది.

ఖైదీలకు అందుబాటులో న్యాయ సహాయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీలక్ష్మి

ఖైదీల సమస్యల పరిష్కారానికి అవసరమైన న్యాయ సహాయాన్ని అందించేందుకు జిల్లా న్యాసేవాధికార సంస్థ సిద్ధంగా ఉందని సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మీ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్, మహిళా కారాగారాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఖైదీలకు అందిస్తున్న ఆహార ప్రమాణాలు, నివాస సదుపాయాలు, వైద్య సేవలను సమీక్షించారు. ఖైదీలతో మాట్లాడి వారి న్యాయ అవసరాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయం కావాలనుకనే ఖైదీలు, వారి కుటుంబ సభ్యులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు పారా లీగల్ వాలంటీర్ల ద్వారా అర్జీలు ఇవ్వాలన్నారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పర్యాటకాభివృద్ధిపై ప్రతిపాదనలకు ఆహ్వానం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో పర్యాటక అభివృద్ధిపై ఆసక్తి ఉన్న వారి నుంచి ప్రతిపాదనలను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి పి.వెంకటచలం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యాటక ప్రోత్సాహం కోసం జలక్రీడలు, సాహస క్రీడలు, లగ్జరీ హౌస్ బోట్లు, పార్టీ బోట్ల వంటి కార్యకలాపాలు నిర్వహించేందుకు ఆసక్తి ఉన్న సంస్థలు, వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చననీ అన్నారు. రాజమహేంద్రవరం గోదావరి పరిసర ప్రాంతాలు, కొవ్వూరు వైపు, ధవళేశ్వరం-వేమగిరి మార్గం, అలాగే నిడదవోలు కాలువ ప్రాంతంలో చేపట్టేందుకు ప్రతిపాదనలు స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు మరిన్ని వివరాలను www.tourism.ap.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చని, అలాగే 9505011951/6309942025 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం, కోరుకొండ మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ జెపిబి.నటరాజన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ సీతానగరం మండలంలోని ముగ్గళ్ల స్టేషన్ పరిధిలో హెటి ఎల్‌టి లైన్ లిఫ్టింగ్ పనుల రీత్యా రఘుదేవపురం, కోరుకొండ మండలం నల్లగొండ, కోటి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

యాత్రికులతో పోటెత్తిన గోష్పాదక్షేత్రం

ప్రజాశక్తి - కొవ్వూరు

కార్తీక పౌర్ణమి సందర్భంగా కొవ్వూరు గోష్పాద క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. బుధవారం తెల్లవారు జామునే యాత్రికులు పెద్ద సంఖ్యలో పాల్గొని గోదావరిలో స్నానాలు ఆచరించారు


కార్మికుల హాజరు పట్టీని పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జ్ కమిషనర్ సుధాకర్

క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు సహకరించాలి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగరాన్ని క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నగర పాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ కెటి.సుధాకర్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన పారిశుధ్య సర్కిల్-1 పరిధిలోని కృష్ణనగర్, వైద్య నగర్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం మస్తర్ల కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. పారిశుధ్య కార్మికుల హాజరు పట్టీని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాకినాడను పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దడంలో పౌరుల భాగస్వామ్యం అత్యంత కీలకమన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచి చెత్తను వేరుచేసి సిబ్బందికే అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గారావు తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్యాలపై పోరాటం అవసరం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలపై పోరాటం సాగించాలని ఎపిఎం మల్లేశ్వరరావు అన్నారు. బుధవారం ఉప్పాడ మత్స్యకార మహిళా సమైక్యలో మాదకద్రవ్యాలు నివారించేందుకు మహిళలకు అవగాహన కల్పించారు. సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు చేయి చేయి కలుపుదాం మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మిద్దాం అనే నినాదంతో ఉప్పాడ రింగ్ రోడ్డు సెంటర్లో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎపిఎం మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల యువత పెడదోవ పడుతోందన్నారు.. మత్తుకు బానిస అవడం వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని తెలిపారు. మాదకద్రవ్యాలను నిర్మూలిస్తే యువత దేశంలో అగ్రస్థానంలో ఉంటుందని ఎపిఎం చెప్పారు. ఈ కార్యక్రమంలో సిసి తౌడు, మహిళలు,. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ప్రభుత్వాసుపత్రిలో వివిధ వైద్య పరీక్షలు, వైద్య సేవల నిమిత్తం వచ్చే గర్భిణులకు బుధవారం మన పెద్దాపురం ఫేస్‌బుక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాతృత్వం కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహార అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫేస్‌బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్ మాట్లాడుతూ పెద్దాపురం పట్టణానికి చెందిన గొర్లి అప్పారావు, అప్పలరాజు దంపతుల కుమార్తె దుర్గాభవాని(భాను) సాయంతో 15 రకాల పౌష్టికాహార పదార్థాలతో అన్నదానం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా దుర్గాభవాని, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫేస్‌బుక్ బంద సభ్యులు బడుగంటి రాజేష్, నవీన్ నాని, ఆనంద్, వడ్డి సత్యనారాయణ, హైదర్ ఆలీ, నెక్కల భుజంగరావు, సతీష్, నాగలక్ష్మి, జి.ఉమాశేఖర్, కె.లక్ష్మి తదితరులు సేవలందించారు.

శాఖల వారీగా ప్రతిపాదనలు ఇవ్వండి

ప్రజాశక్తి - కొవ్వూరు

నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి శాఖల వారీగా ప్రతిపాదనలు రూపొందించాలని ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పంచాయతీరాజ్ రోడ్లు, గ్రామల్లో సిసి రోడ్లు, డ్రెయిన్లు, వాటర్ ట్యాంక్‌లు అవసరమైన చోట నిర్మాణాలకు సంబంధించిన ప్రతిపాదనలు రూపొందించాలని అన్నారు. సర్వశిక్ష అభియాన్‌లో అదనపు తరగతి గదులు, కాంపౌండ్ వాల్స్, మరుగుదొడ్లు అవసరమైన స్కూల్స్ నుంచి ప్రతిపాదనలు తయారు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సఫాయి కర్మచారి యువతకు రుణాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలోని సఫాయి కర్మచారి వృత్తిలో ఉన్న నిరుద్యోగ యువతకు ఎన్‌ఎస్‌కెఎఫ్‌డిసి పథకంలో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలు రాయితీపై రుణాలు ఇచ్చేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా షెడ్యూల్ కులముల సహకార సంఘం లిమిటెడ్ కార్యనిర్వాహక సంచాలకులు జె.సత్యవతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి షెడ్యూల్ద్ కులముల ఆర్థిక సహకార సంఘం లిమిటెడ్ జిల్లాకు మంజూరు చేసిన 3000 లీటర్ల సామర్థ్యం గల వాహనాలలో, రుణం చెల్లించడంలో విఫలమైన లబ్ధిదారులకు సంబంధించిన రెండు వాహనాలు షరతుల మేరకు తిరిగి మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఆశక్తి, అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తులను కాకినాడలోని ఎస్‌సి కార్పొరేషన్ కార్యాలయంలో వ్యక్తిగతంగా లేదా పోస్టు ద్వారా అందజేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం 6281817023ను సంప్రదించాలన్నారు.

నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం


సమావేశంలో మాట్లాడుతున్న డిఇ

మండలంలో గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని గృహనిర్మాణ శాఖ ఇన్‌ఛార్జ్ డిఇ ఎవి.రామారావు ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు గృహ నిర్మాణాలను పూర్తి చేయడానికి సుముఖంగా లేకపోతే ఇప్పటి వరకూ తీసుకున్న డబ్బులను ఆర్‌టిజిఎస్ ద్వారా ప్రభుత్వానికి తిరిగి చెల్లించాలని స్పష్టం చేశారు. నిర్మాణాలను ప్రారంభించని లబ్ధిదారుల నుంచి నిధులను రికవరీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ భారతి, డిప్యూటీ ఎంపిడిఒ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.